## క్లుప్తంగా

### శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

**ఎర్రవల్లిచౌరస్తా:** బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

### ధరూరు ఎస్‌ఐగా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

**ధరూరు:** మండల ఎస్‌ఐగా విజయ్‌కుమార్ బాధ్యతలు చేట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శివానందంగౌడ్ జడ్చర్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ నుంచి విజయ్‌కుమార్ ధరూర్ మండల ఎస్‌ఐగా వచ్చారు. సోమవారం శివానందం గౌడ్ నుంచి విజయ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రేవులపల్లి పోలీసులు వారిని శాలువా, బొకేలతో సన్మానించారు.

**ఇటిక్యాల ఎస్‌ఐగా వెంకటేష్**

**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల ఎస్‌ఐగా వెంకటేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అశోక్ బాబు బదిలీపై జడ్చర్ల పీఎస్‌కు వెళ్లడంతో.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేటిదొడ్డి పీఎస్ నుంచి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. సందర్భంగా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పీఎస్ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఎల్లప్పుడూ భద్రతను కల్పిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు.

**గట్టు ఎస్‌ఐగా రామకృష్ణ**

**గట్టు:** ఎస్‌ఐగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నందికర్ బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లగా, ఆయన స్థానంలో రామకృష్ణ బాధ్యతలను స్వీకరించారు. పోలీస్ సిబ్బంది ఎస్‌ఐకి ఘనంగా వీడ్కోలు పలకగా, కొత్తగా ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ రామకృష్ణ కోరారు.

**మానవపాడు:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ చంద్రకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానన్నారు. మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాము జోగుళాంబ గద్వాల డీఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

### సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించండి

**అలంపూర్ రూరల్:** పద్మశాలీయులందరు ఏకతాటిపైకి వచ్చి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందిచాలని అలంపూర్ పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శుల గడ్డం నాగన్న, కుంటుమల్ల మారుతిలు తెలిపారు. పట్టణంలో చేనేత సహకారసంఘం కార్యాలయంలో సోమవారం పద్మశాలీయులు కుల బంధువుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలు, సంఘం అభివృద్ధికి సంబంధించిన విషయాలు చర్చించారు. ఈనెల 12 మార్కండేయ స్వామి జయంతికి కుల బంధువులందరు కలిసి రావాలని కోరారు. సర్వేశ్వర్, ఎల్లయ్య, నాగరాజు, శివ, శేఖర్, వెంకటేష్, రాముడు నాగరాజు, అంజనేయులు పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం చేయండి

**అలంపూర్ రూరల్:** ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న గ్రామీణ బంద్ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఎల్‌ఓసీ అందజేత

**గద్వాల అర్బన్:** మండలంలోని చెనుగోనిపల్లికి చెందిన నర్సింహులుకు వైద్యసేవల నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీని సోమవారం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, నాయకులు లత్తీపురం వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాఘురామిరెడ్డి ఉన్నారు.

### విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

**మల్దకల్:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి అర్థమైన రీతిలో విద్యాబోధన చేయాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోధ్యాయుడు నరేష్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఐఈసీపై అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యా సామర్థ్యాలు వెలికి తీయాలి

**మానవపాడు:** పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమర్థ్యాలను వెలికితీయాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. మండలంలోని జల్లాపురంలో ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలించారు. ఉపాధ్యాయురాలు భాగ్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దవాగులో ముళ్లపొదలు



పెద్దవాగులో వ్యాపించిన దట్టమైన ముళ్ల పొదలు

- ప్రమాదకరంగా పెద్దవాగు
- మురుగు నీటితో కంపు కొడుతున్న వాగు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పెద్దవాగులో దుర్వాసన వెదజల్లుతున్న మురుగు

**అయిజ:** మండల కేంద్రంలోని పెద్దవాగులో ముళ్ల పొదలు దట్టంగా అలుముకున్నాయి. భారీ వర్షాలు కురుస్తే వాగులో వరద ప్రవాహంతో అయిజ పట్టణం మునిగిపోయే ప్రమాదం ఉంది. 2009లో కురిసి భారీ వర్షాలకు అయిజ పట్టణంలోకి నీరుచేరి కమంతంపేట, గుర్రం తోట, ఉప్పర పేట, అంబేద్కర్ కాలనీ, ఎస్సీ కాలనీ, తెలుగుపేట, మాలపేట తదితర కాలనీలు వరద నీటిలో మునిగిపోయాయి. ఆ రోజు పట్టణంలోని వివిధ కాలనీల ప్రజలు ఊరిని ఖాళీ చేసి మండలంలోని వివిధ గ్రామాల్లో తలదాచుకున్నారు. అపట్టి నుంచి అధికారులు రెండు మూడు సంవత్సరాలకోసారి పట్టణంలోని పెద్దవాగులో పెరిగిన ముళ్ల పొదలను తొలగిస్తూ వచ్చారు. ముళ్లపొదలు పెరగకుండా పట్టణంలోని పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్యన వాగులో బ్రిడ్జికి ఇరువైపుల 200 మీటర్లమేర రూ.కోటి నిధులతో సీసీ కాంక్రీట్ బెడ్ వేశారు. ఎనిమిదేళ్ల క్రితం రూ.8 లక్షలు వెచ్చించి వాగులో యంత్రాలతో ముళ్ల పొదలను తొలగించారు. అయితే ఇప్పుడు మళ్లీ ముళ్ల పొదలు వాగులో దట్టగా పెరిగాయి. వాగుకు వరద ప్రవాహం వస్తే ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. దానివల్ల వరద నీరు పట్టణాన్ని ముంచెత్తే అవకాశం ఉంది. పట్టణంలోని పశువుల ఆస్పత్రి ముందు నిర్మించిన కల్వర్టు సమీపంలో వాగులో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దాని వల్ల దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులోని ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### గతంలో భారీ వరద వచ్చింది



13ఏళ్ల క్రితం భారీ వర్షాలు కురవడంతో అయిజ పట్టణంలోని పెద్ద వాగుకు భారీగా వరదనీరు వచ్చింది. దాని వల్ల పట్టణంలోని వివిధ కాలనీలు నీటిలో ముగిని పోయాయి. దీంతో రూ.కోట్ల నష్టం సంభవించింది.

– వెంకట్రాములు, అయిజ

### మునిగిపోకుండా చర్యలు చేపడుతాం



వరద ఉధృతికి పట్టణం ముంపునకు గురికాకుండా చర్యలు చేపడుతాం. పట్టణంలోని పెద్ద వాగుపై ముళ్ల పొదలు వ్యాపించకుండా పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ ప్రాంతంలో గతంలో 200 మీటర్ల మేరా వాగుకు ఇరువైపుల గతంలో సీసీ బెడ్డును ఏర్పాటు చేశాం. అయితే దానికి ఆవల ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించాయి. కౌన్సిల్ తీర్మానంలో ఆమోదిస్తే మళ్లీ ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపడుతాం

– గోపాల్, మున్సిపల్ ఏఈ

### అధికారులు చర్యలు చేపట్టాలి



మున్సిపాలిటీలోని పెద్ద వాగులో ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించి వరదనీరు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. పశువుల ఆస్పత్రి ముందు వాగులో మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అటువైపు వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వాగులో మురుగును తొలగించాలి.

– తిరుమలరెడ్డి, అయిజ

### ముళ్ల పొదలను తొలగించాలి



ప్రతి సంవత్సరం వాగులోని ముళ్ల పొదలను అధికారులు తొలగిస్తున్నారు. 8 ఏళ్ల క్రితం ముళ్ల పొదలను తొలగించారు. అవి మళ్లీ పెరిగి పెద్ద చెట్లుగా మారాయి. వాగులో నీటి ప్రవాహానికి అడ్డుగోడలా మారాయి. భారీ వర్షాలు కురిస్తే వాగులో వచ్చే వరద ప్రవాహానికి ముళ్ల పొదలు అడ్డుపడుతాయి. దానివల్ల వరద నీరు పట్టణంలోని వివిధ కాలనీలను ముంచెత్తుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– ఖాజా, అయిజ

### సగం ఊరు మునిగిపోయింది



వాగులో ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించాయి. వాటిని తొలగించక పోతే వరద ఉధృతికి పట్టణం మునిగిపోయే ప్రమాదం ఉంది. 2019లో కురిసిన కుంభ వృష్టికి అయిజ వాగుకు ఉధృతంగా ప్రవాహం వచ్చింది. వాగులో ముళ్ల పొదలు ముందుకు సాగడానికి వీలులేక పట్టణాన్ని ముంచెత్తింది. భారీ వర్షాలు కురిస్తే 14 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలు పునరావృతమయ్యే అవకాశాలున్నాయి.

– శ్రీనివాసులు, అయిజ

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ధరూరులో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

**ధరూరు:** భారత రిపబ్లిక్ డే సందర్భంగా గద్వాల జిల్లా స్థాయిలో కలెక్టర్ చతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం పొందిన ఎంఈఓ సురేష్, ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డిలను కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంఎస్ఓ రవీంద్ర, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాపాలను కప్పి పుచ్చుకునేందుకు తాపత్రయం



ధరూరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కాగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి

**ధరూరు:** పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు తాపత్రయ పడుతోందని కాంగ్రెస్ మండల నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజారెడ్డిలు మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు చేసిన పాపాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని కాంగ్రెస్‌కు అంటగట్టి తెలంగాణ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ పరిణామాన్నంతా రాష్ట్ర ప్రజానీకం గమనిస్తూనే ఉందని అన్నారు. కృష్ణా నదిలో 68 శాతం పరివాహక ప్రాంతం తెలంగాణలో ఉన్నప్పటికీ అవిభక్త ఆంధ్రప్రదేశ్ వాటా 118 టీఎంసీలలో తెలంగాణ వాటా 299 టీఎంసీలకు 2015లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. 2014లోనే వారి హయాంలోనే చట్టం రూపొందించారని, ఈ చట్టం ఇలా ఉండటానికి కేసీఆరే కారణమన్నారు. గత ఏడాది జనవరి 27న 16 కేఆర్ఎంబీ జరిగిన సమావేశంలో కృష్ణా ప్రాజెక్టులను కేద్రానికి అప్పగిస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. 17వ బోర్డు సమావేశంలో ఇదే జరిగిందన్నారు. నీళ్ల నిధులు, నియామకాల కోసం ఎందరో పోరాటాలు చేసి ఆత్మ బలిదానాల వల్ల రాష్ట వచ్చిందన్నారు. అయితే వచ్చిన తెలంగాణను టీఆర్ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కి కుటుంబ పాలనతో దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కర్రెన్న, సవారన్న, రామిరెడ్డి, దేవన్న, పరమేష్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయానికి సమ్మె నోటీస్

**అయిజ:** ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ, మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 16న తలపెట్టిన సమ్మెకు సంబంధించిన నోటీసును సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌కు, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నకు అందజేశారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఔట్‌సోర్సింగ్ కార్మికులను బేషరతుగా పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల 16 నుంచి మూకుమ్మడిగా సమ్మెకు దిగుతామని, ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను కొనసాగిస్తామన్నారు. యూనియన్ ప్రతినిధులు యాకోబు, రామకృష్ణ, వీరేష్, రవి కుమార్, సుందర్ రాజు, వినోద్, సురేందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

## పుటాన్‌దొడ్డి జీపీకి పన్ను కట్టాలని వినతి



పుటాన్‌దొడ్డి జీపీలో ఎంపీఓకు వినతి ఇస్తున్న గ్రామస్తులు

**ఎర్రవల్లిచౌరస్తా:** ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి స్టేజీలో గృహాలు, షాప్‌లను నిర్మించుకున్న వారు పుటాన్‌దొడ్డి జీపీకి పన్ను చెల్లించాలని సోమవారం గ్రామస్తులు ఎంపీఓ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుటాన్‌దొడ్డి జీపీలో ఉన్న ప్లాట్లలో గృహాలు, షాప్‌లను నిర్మించుకున్న వారు ఇప్పటి వరకు కోదండాపురం జీపీకి ఇంటి పన్ను చెల్లించారని, తమ గ్రామ పంచాయతీకి సంబంధించిన పన్నును కోదండాపురం జీపీ నుంచి తిరిగి చెల్లించడంతో పాటుగా కొత్త నిర్మాణాలు చేపట్టే వారు పుటాన్‌దొడ్డి జీపీ నుంచి అనుమతులు తీసుకొని పన్ను చెల్లించాలని వినతిలో కోరినట్లు తెలిపారు. కార్యదర్శి అరుణ, గ్రామస్తులు సురేందర్, మహేష్, మద్దిలేటి, సుధాకర్, మల్లికార్జున్, పరుశ, నర్సింహులు, వెంకట్రాముడు, రవి, హరి, లక్ష్మన్న, నరేష్ ఉన్నారు.

### బూత్ కమిటీలకు పత్రాల అందజేత



**ధరూరు:** మండలంలోని 65, 66వ బూత్‌లలో నూతన కమిటీలను నియమించినట్లు మండల కాంగ్రెస్ నాయకులు జకిలేటి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బూత్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, నరేందర్‌రెడ్డి, రామిరెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

### బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



**అయిజ:** బీజేపీ పరిపాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బింగుదొడ్డిలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారుల ఇంటింటికి తిరిగి బీజేపీ చేస్తున్న అభివృద్ధిపై తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, నరసింహులు, భీమన్న, ఉరుకుందు, శ్రీనివాసులు, నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల కిసాన్‌మోర్చ అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. బీజేపీ చేపట్టనున్న గావ్ చలో– ఘర్ చలో కార్యక్రమంపై మండలంలోని నందిన్నె గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పీఎం సురక్ష బీమా యోజన, ఆటల్ పెన్షన్ యోజన, ఆయుష్మన్ భారత్, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమయ్య, నాగేష్, శంకర్‌నాయక్, చిన్న నాగేష్, శ్రీను, విశ్వనాథ్‌గౌడు, ఈరన్న గౌడు, విజయ్‌నాయుడు, పాల్గొన్నారు.

### స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సద్వినియోగం చేసుకోండి

**మానవపాడు:** ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో అనుసరించాల్సిన బోధనా పద్ధతులను బోధనోపకరణాలను తయారు చేసుకొని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి



కమిషనర్ నిత్యానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**అయిజ:** పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వివిధ పార్టీల, సంఘాల నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కొన్ని ప్రదేశాల్లో వీధి లైట్లను ఏర్పాటు చేయలేదని, రోడ్లకు ఇరువైపులా వీధి లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈనెల చివరి వారంలో తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జాతరకు వివిధ రాష్ట్రాలనుంచి అనేకమంది భక్తులు తరలివస్తుంటారని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అంజి, మాదన్న, సాంబశివుడు, సుధాకర్ గౌడ్ ఉన్నారు.

## సామాజిక ఉద్యమ కరదీపిక కేవీపీఎస్ డైరీ



కేవీపీఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ, కేవీపీఎస్ నాయకులు

**అలంపూర్:** సామాజిక ఉద్యకారులకు కేవీపీఎస్ డైరీ ఒక కరదీపిక అని ఎస్‌ఐ నాగరాజు అన్నారు. అలంపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో కేవీపీఎస్ 2024 డైరీని ఎస్‌ఐ కేవీపీఎస్ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహనీయుల జీవిత ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం కల్పించిన చట్టాలు, జీఓలతో ప్రచురించిన డైరీ ఉద్యమకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కేరియర్ రామస్వామి, కారల్ మార్క్స్ వంటి మహనీయుల ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు మహనీయులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. సమగ్ర సమాచారంతో డైరీని ప్రచురించిన కేవీపీఎస్ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుంకన్నబాబు, కేవీపీఎస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, నాయకులు నరసింహ్మ, గంగన్న ఉన్నారు.

## పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



ధరూరులో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ వర్కర్లు

**ధరూరు:** ఏళ్ల తరబడిగా గ్రామ పంచాయతీ వర్కర్లుగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, (ఐఎఫ్‌టీయూ అనుబంధం) సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తిక్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నో సార్లు వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి పర్మినెంట్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రాములు, రంగన్న, రంగమ్మ, లక్ష్మి, మహదేవ్, హరి, రామకృష్ణ, మహేశ్వరి, సుజాత, శ్రీదేవి, శంకరమ్మ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉంది



ఉండవెల్లి సర్పంచుకు సన్మానం చేస్తున్న సిబ్బంది

**ఉండవెల్లి:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రజలందరి భాగస్వామ్యం ఉందని మాజీ సర్పంచ్ రేఖ తెలిపారు. పదవీ కాలం ముగిసిన సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రేఖ మాట్లాడారు. అందరి సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేశామని, ప్రధాన పాత్ర పంచాయతీ కార్మికులు, కార్యదర్శిది ఉందన్నారు. అనంతరం యువతకు టీ షెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు శివారెడ్డి, ముత్యాల్‌రెడ్డి, రఘురాములు శెట్టి, ఆదర్శ విద్యార్థుల సంఘం సభ్యులు వెంకటేష్ గౌడు, కృష్ణ, బల్‌వీర్ సింగ్ పాల్గొన్నారు.

**మాజీ సర్పంచ్‌లకు సన్మానం**

**అయిజ:** ఐదు సంవత్సరాల క్రితం గ్రామ సర్పంచ్‌లుగా ఎన్నికై ఇటీవల పదవీకాలం పూర్తయిన మాజీ సర్పంచ్‌లకు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ సాయిప్రకాష్, ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డిలు సన్మానం చేశారు. మొత్తం 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన మాజీ సర్పంచ్‌లకు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఐదు సంవత్సరాలు ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ప్రజలకు సేవ చేశారని, గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేశారని కొనియాడారు. వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కుంగిపోయిన నేల.. నెర్రలిచ్చిన గోడ



దెబ్బతిన గదులలో విద్యార్థులు

**ఉండవెల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గదులు నెర్రలిచ్చాయి. నెల కుంగిపోయింది. విద్యార్థులు బయటకు వెళ్లే క్రమంలో బండల కింద మట్టి కుంగిపోయింది. నడిచే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. గదులు శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు బోధన సమయంలో విద్యార్థులు పైకప్పును, గోడలను చూసుకుంటు బయాందోళనకు గురవుతున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాల మంజూరై పిల్లర్ల దశకు చేరింది. కానీ పంచాయతీ రాజ్ ఏఈ నరేందర్, వనపర్తి డీఈగా ప్రమోషన్‌తో బదిలీ కావడంతో, మళ్లీ పనులు నెమ్మదించాయి. ఇప్పటికై నా పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

## ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని సాధించాలి



అలంపూర్ మాంటిస్సోరీ జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న ప్రిన్సిపల్




విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**అలంపూర్:** పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో 2023–24 పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సోమవారం విద్యార్థులు నృత్యాలు, స్కిట్స్‌లు, వేషధారణలతో విద్యార్థులను, ఉపాధ్యాయులను అలరించారు. ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని సాధించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ కెయస్ వి రవి ప్రకాశ్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలని, రాబోయే పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. 2023–24 ఏడాదిలో ఉత్తమ విద్యార్థులకు సన్మానం నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంతుల్లో పెద్ద చింతరేవుల ఆలయం



విద్యుత్ దీపాలంకరణలో వెలిగిపోతున్న ఆంజనేయ స్వామి ఆలయం



స్వామివారి మూల విరాట్

**ధరూరు:** కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం విద్యుత్ దీపాలతో వెలిగిపోతోంది. ఈ నెల 12 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు సోమవారం విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. దీంతో బ్రహ్మోత్సవాల వాతావరణం ప్రారంభమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కృష్ణానది సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు ఈ సారి భక్తులు పెరిగే అవకాశాలున్నాయని, అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేసిన లైటింగ్‌తో ఆలయం దగదగా మెరిసిపోతోంది.